HICON SERIES

CLASS 4 | TELUGU

తెలుగు వెలుగు CLASS 4

LESSON 2






CLICK HERE TO ACTIVATE

LESSON
PART 2

# 2 నిజమైన స్నేహితులు

ఒక అడవిలో ఒక కుందేలు ఉండేది. అది చాలా జాలి గుండె కలది. చేతనైనంత వరకు ఇతరులకు సాయపడుతూ ఉండేది.

ఒకసారి ఒక మేక అనారోగ్యంతో తిండి లేక పడివుంటే కుందేలు దాని దగ్గరకు వెళ్ళి " నేను నీకు మేత తెచ్చిస్తాను" అని చెప్పి తన చిన్న నోటితో చాలాసార్లు తిరిగి దానికి సరిపడా ఆహారం తెచ్చిపెట్టింది. అది తిన్న తరువాత ఆకుదొప్పతో నీళ్ళు తీసుకుని వచ్చి నీళ్ళు కూడా పట్టింది.

ఒక గుర్రం కాలులో ముల్లు దిగి అవస్థపడుతుంటే కుందేలు, "మిత్రమా! నీవు బాధపడవద్దు. నీ ముల్లు నేను తీస్తాను" అని వేరొక ముల్లు తీసుకుని వచ్చి, మెల్లగా, జాగ్రత్తగా, ఆ ముల్లు తీసి దానికి నొప్పి తగ్గించింది.





కుందేలు ఒక రోజు ఆహారం తింటుండగా ఒక డేగ వచ్చి దాని ముందు పడిపోయింది. వేటగాడు వేసిన బాణం వల్ల దాని రెక్కలకు గాయమై, రక్తం కారుతూ ఉంది. అది చూసి చలించిపోయిన కుందేలు "మిత్రమా! నీవు బాధపడవద్దు" అంటూ పరుగెత్తుకుంటూ వెళ్ళి రకరకాల ఆకులను తీసుకువచ్చింది. రసం తీసి డేగ రెక్కల పైన పోసింది. దానికి ఉపశమనం కోసం చిన్న ఆకును తీసుకుని విసురుతూ కూర్చుంది. ఇలా కొంచెంసేపు చేయడం వలన రెక్కలనుండి రక్తం కారడం ఆగిపోయింది. డేగ వెళ్ళి పోయింది.

ఒక రోజు కుందేలు సరదాగా ఆడుకుంటున్న సమయంలో ఒక వేటగాడు కుందేలు వెనుకపడ్డాడు. అది పరుగెత్తుకుంటూ మేక దగ్గరకు వెళ్ళి "వేటగాడు నన్ను తరుముతున్నాడు, నన్ను కాపాడు" అంది. మేక " ఇప్పుడు కుదరదు, నాకు పని వుంది" అంది.

కుందేలు పరుగు తీస్తూ గుర్రం వద్దకు వెళ్ళి “నన్ను వేటగాడు తరుముతున్నాడు. కాపాడు” అంది. అప్పుడు గుర్రం “నా కోసం యజమాని ఎదురుచూస్తూ ఉంటాడు” అని వెళ్ళిపోయింది.

చేసేది లేక కుందేలు పరుగుతీస్తూ ఉండగా డేగ దానికి దగ్గరగా వచ్చి “మిత్రమా ! నీవు నా కాళ్ళను గట్టిగా పట్టుకో” అని అంది. వెంటనే ఆలస్యం చేయకుండా కుందేలు డేగ కాళ్ళను గట్టిగా పట్టుకుంది. డేగ వేగంగా ఆకాశంలోకి ఎగిరింది. “కుందేలు దొరకలేదు” అనుకుంటూ వేటగాడు వేరే ప్రదేశానికి వెళ్ళాడు.

డేగ కుందేలును ఒక గట్టు మీద దించి “నీవు దయతో ఒకనాడు నాకు చేసిన సహాయానికి ప్రత్యుపకారం చేసే అవకాశం నాకు ఇప్పుడు కలిగింది” అని చెప్పింది. “ఇప్పటి నుండి మనం మంచి స్నేహితులం” అని అంది. కుందేలు అందుకు ఎంతగానో సంతోషించింది.



## అభ్యాసం

### I. అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆహారం | = | భోజనం | అవస్థ పడుట | = | బాధపడుట |
| మిత్రుడు | = | స్నేహితుడు | ఉపకారము | = | మేలు |
| ఉపశమనం | = | ఊరట | ప్రత్యుపకారము చేయడం | = | మేలు చేసినవారికి తిరిగి మేలు చేయడం |
| సరదాగా | = | ఆసక్తిగా | | | |
| అతి | = | అధికం, ఎక్కువ | అవకాశము | = | వీలు |
| తరుముట | = | వెంటపడుట | ప్రదేశం | = | చోటు |

## II. పదజాలం

### (అ) వ్యతిరేక పదాలు రాయండి.

1. నిజం × ________
2. అనారోగ్యం × ________
3. దగ్గర × ________
4. జాగ్రత్త × ________
5. బాధ × ________
6. మిత్రుడు × ________

### (ఆ) బహువచనాలు రాయండి.

1. మిత్రుడు – ________
2. ఆకు – ________
3. రెక్క – ________
4. బాణం – ________

### (ఇ) క్రింది ఖాళీలను పూరించండి.

1. కాలులో ముల్లు దిగి అవస్థపడుతున్నది ________
2. అనారోగ్యంతో బాధపడుతున్నది ________
3. వేటగాడి బాణానికి దెబ్బతిన్నది ________
4. ఇతరులకు సాయంచేసే స్వభావం కలది ________

### (ఈ) క్రింది పదాలు ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.

1. ప్రత్యుపకారం : ________
2. ఉపశమనం : ________
3. తరుముట : ________
4. చలించిపోవుట : ________

### (ఉ) జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. కుందేలు | ( ) | (క) | ప్రత్యుపకారం |
| 2. మేక | ( ) | (గ) | ముల్లు |
| 3. గుర్రం | ( ) | (చ) | జాలి గుండె |
| 4. డేగ | ( ) | (జ) | అనారోగ్యం |

## III. ప్రశ్నావళి

**(అ) ఈ క్రింది ప్రశ్నలకు ఒకటి లేక రెండు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. కుందేలు ఎలాంటి స్వభావం కలది ?
2. డేగను చూసి కుందేలు ఎందుకు చలించిపోయింది ?
3. తిండిలేక పడివున్న మేకను ఆదుకున్నది ఎవరు ?
4. గుర్రం ఎందుకు బాధపడింది ?

**(ఆ) ఈ క్రింది ప్రశ్నలకు ఐదు లేక ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. నిజమైన స్నేహితులు ఎవరు ? సోదాహరణంగా వివరించండి.
2. 'నిజమైన స్నేహితులు' పాఠంలో ప్రత్యుపకారం చేసినది ఎవరు ? చెయ్యనిది ఎవరు ?

## IV. వ్యాకరణం

**ఈ క్రింది పేరాను చదవండి. గీత గీసిన పదాలను గమనించండి.**

విజయ్, రవి, జోసఫ్, ఇమ్రాన్, రేష్మ, ప్రశాంతి, కాథరిన్ ఇంకా కొంతమంది కలిసి విజయవాడ నగరానికి వెళ్ళారు. జంతుప్రదర్శనశాలకు వెళ్ళారు. ఏనుగు, సింహం, జిరాఫీ, జింక, మొదలగు జంతువులను చూశారు. తర్వాత పార్కులోకి వెళ్ళారు. అందులో ఎటుచూసినా పువ్వులే. మల్లెలు, చామంతులు, విరజాజులు, మందారాలు, గులాబీలు, బంతిపూలు, తంగేడుపూలు ఉన్నాయి.

పై పేరాలో గీత గీసిన పదాలన్నీ పేర్లను సూచిస్తున్నాయి. మనుషుల పేర్లు, స్థలాల పేర్లు, జంతువుల పేర్లు, పూల పేర్లు......ఇలా పేర్లను తెలిపే పదాలను **నామవాచకాలు** అంటారు.

మనుషులు, జంతువులు, పక్షులు, స్థలాలు, పర్వతాలు, వస్తువులు మొదలగు వాటి పేర్లను తెలిపే పదాలు నామవాచకాలు.

## V. ప్రాజెక్టు పని



తరగతి గదిలో మీకు ఎదురైన సంఘటనల ఆధారంగా ప్రత్యుపకారాలను రికార్డు చెయ్యండి.

H4TR